ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024 | 5 | విజయనగరం

జమ్ము పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం

గత ఏడాది జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపికైన జమ్ము ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ ఆదివారం సందర్శించారు. జాతీయ స్థాయిలో 2021-22లో 35 పాఠశాలలను స్వచ్ఛ విద్యాలయలుగా మన రాష్ట్రం నుంచి జమ్ము ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేశారు. జిల్లా పర్యటన కోసం వచ్చిన కమిషనర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మౌళిక వసతులు, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి స్వచ్ఛ విద్యాలయంగా రూపొందించడంలో కషి చేసిన ఎం. రామ్మోహన్ రావును శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర రెడ్డి, ఎంఇఒలు రాజు, సత్యవతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు

లక్ష్యం చేరని ఆయిల్‌పామ్

- రాయితీలను అందుకోలేకపోతున్న రైతులు
- నీటి వసతి కల్పించకపోవడమే కారణం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దేశంలో ఆయిల్ పామ్ సాగుకు ఆంధ్రప్రదేశ్ పెట్టింది పేరు. అందులోనూ మన జిల్లాలో దీని సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాగుకు అనుగుణమైన సారవంతమైన మెట్ట భూములు మన రాష్ట్రంలో ఉండడమే ఇందుకు కారణం. ఈనేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేంచేందుకు, తద్వారా ఆయిల్ డిమాండ్‌ను తగ్గించుకునేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది మన రాష్ట్రానికి కాస్తంత ఎక్కువ లక్ష్యం విధించినప్పటికీ, ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడి ంది. ఆయిల్ పామ్ సాగుకు నిరంతరం నీరు అందుబాటులో ఉండాల్సివుంటుంది. లేదంటే భారీ నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యధికంగా భూగర్భజలాలు ఉండడంతోపాటు బోర్లు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ఆయిల్ పామ్ సాగవుతుంది. విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో నాగావళి, వంశధార, చంపావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి వంటి నదీపరివాహక ప్రాంతాల్లోనూ సాగు ఉంది. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 60వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం విధించగా, స్థిరమైన నీటి లభ్యత లేని కారణంగా లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడింది. కేవలం 42వేల ఎకరాలు మాత్రమే సాగు విస్తీర్ణం పెరిగింది. ఇందులోనూ ఎక్కువగా భాగం కోనసీమ, ఏలూరు, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లోనే కనిపిస్తోంది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో తక్కువగా పెరిగింది.

వాస్తవానికి ఆయిల్ పామ్ లాభసాటి వాణిజ్యపంట. చీడపీడ సమస్య అనేది ఉండనే ఉండదని ఉద్యాన వనశాఖ అధికారులు చెబుతున్నారు. సాగుకు అనుగుణమైన మెట్ట ప్రాంతంలో పుష్కలమైన నీటి వనరులు ఉంటే ఆదాయానికి కొదవలేనట్టే. దీనికితోడు మొక్కలు మొదలుకుని, సాగు, అంతర్‌పంటల వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ఇన్‌పుట్ సబ్సిడీ కల్పించాయి. ఒక 2.5ఎకరాల్లో స్వదేశీ మొక్కలు నాటితే 2,1000, విదేశీ మొక్కలకు 29వేలు చొప్పున ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలే ఇన్‌పుట్ సబ్సిడీలు అందిస్తాయి. ఇలా ఒక్కో రైతూ 37.5 ఎకరాల వరకు సబ్సిడీ పొందేందుకు అవకాశం ఉంది. 4ఏళ్ల సాగు సమయంలో ప్రతి 2.5 ఎకరాలకు ఏటా రూ.5,250 చొప్పున, అంతరపంటలకు మరో రూ.5,250 చొప్పున రాయితీ పొందేందుకు అవకాశం ఉంది. అంతకు మించి సారవంతమైన మెట్ట భూములు కూడా రాష్ట్రంలో అనేక చోట్ల ఉన్నాయి. కానీ, వాటికి నీటి వసతి మాత్రం లేదు. రాష్ట్రంలో జలసిరి బోర్లు పథకం ముందుకు సాగలేదు. గతంలో ఎపిఎంఐపి ద్వారా సబ్సిడీపై ఇచ్చే డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు మచ్చుకు కూడా మంజూరు కాని పరిస్థితి. వర్షపునీరు కూడా నదుల ద్వారా సముద్రంలోకి పోవడం తప్ప జంఝావతి, తోటపల్లి, వంశధార వంటి ప్రాజెక్టులు పూర్తిచేయలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు గత ఏడాది వరకు 4,375 ఎకరాల్లో ఉంది. ఈ ఏడాది కేంద్రం ఇచ్చిన లక్ష్యం ప్రకారం 1,845 ఎకరాల మేర పెంచాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 855 ఎకరాలు మాత్రమే పెరిగింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ నీటి వసతి లేకపోవడం వల్ల లక్ష్యం చేరుకోవడంలో వెనుకబాటు కనిపిస్తోంది. నీటి వసతి అందుబాటులోకి తెస్తే ఆయిల్ పామ్ రైతులకు రూ.కోట్ల ఆదాయం సమకూరుతుందని రైతాంగం చెబుతోంది.

సాగునీటి వసతి లేకే లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం

సాగునీటి వసతి లేకే ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. జిల్లాలో నీటి వసతి ఉన్న అన్నిచోట్ల ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం. కొన్ని నదుల్లో నీరు ఉన్నా అక్కడ ఆనకట్టలు, బోర్లు వంటివి లేవు. జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో బోర్లు కూడా తక్కువగానే ఉన్నాయి. బోర్లు ఉన్నచోట కూడా డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం లేదు. ఆయిల్‌పామ్ సాగుకు నీరే అత్యంత కీలకం. కనీసం 2.5 అంగులాల బోరు నింతరం పారుతుండాలి.

- ఎవిఎస్‌వి జమదగ్ని
జిల్లా ఉద్యాన శాఖ అధికారి

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా మంచి మార్కులు తెచ్చుకునే అవకాశం ఉందని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.సందీప్ కుమార్ తెలిపారు. ఆదివారం విజయనగరం డివిజన్‌లోని బిసి వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే.పూర్తయిన సిలబస్‌ను ప్రాధాన్యత క్రమంలో ప్రణాళిక బద్ధంగా చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం సబ్జెక్ట్ నిపుణులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయనగరం అర్బన్ ఎ ఎస్‌డబ్ల్యుఒ రాజులమ్మా, 11 వసతి గృహాల నుంచి 104మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పేరు తేవాలి

- విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపు
- పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభం
- రెండు కొత్త కోర్సులు, అదనపు వసతులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యార్థులు బాగా చదువుకొని రాష్ట్రానికి, తల్లితండ్రులకు గొప్ప పేరు తేవాలని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. కేజీ నుంచి పీజీ వరకు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రభుత్వం రాష్ట్రంలో అత్యున్నత విద్యను అందిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన గద్దె బాబూరావు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసం జరుగుతున్న సమయంలోనే జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అభివృద్ధి చెందాలనే తపన ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు . కళాశాలలో నెలకొన్న సమస్యలపై మంత్రి ప్రిన్సిపాల్ ఎల్. విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో కావలసిన మౌలిక వసతులు అంశాలపై విద్యార్థులను మంత్రి ఆరా తీసారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ అద్యాపకుల కొరతతో పాటు ల్యాబ్ సదుపాయం, ప్లేస్‌మెంటులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. స్పందించిన మంత్రి వాటికి సంబంధించిన నివేదికలను తక్షణమే తయారు చేసి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రస్తుతం కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్, సివిల్ కోర్సులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కళాశాలకు అదనపు ఫ్యాకల్టీ, ఆఫీస్ స్టాఫ్, హాస్టల్ మంజూరు చేస్తామని, క్యాంపస్ రిక్రూట్మెంట్ సౌకర్యాన్ని పెంచుతామని చెప్పారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, కళాశాల చరిత్ర, అభివద్ధి చెందిన విధానాన్ని వివరించారు. తన ఎంపి నిధులు రూ.10 లక్షలతో కళాశాల ప్రాంగణంలో అథ్లెటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, సాంకేతిక నిపుణులకు అపార ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, ఎంపిపి ప్రతినిధి ఇప్పిలి అనంత్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి, పలువురు విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌జెడి సత్యనారాయణ మూర్తి, ఆర్‌డిఒ బి. శాంతి, ఎంపిపి. ఐ.వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వి.శిరీష, తాహశీల్దార్ ఎన్.ప్రసాద రావు, ఎంపిడిఒ డి.శ్వేత, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స, ఎమ్‌పి బెల్లాన

గ్రామాల్లో మూడు దేవాలయాలను నిర్మించాం

ప్రతీ గ్రామ పంచాయతీలోను సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వంటి మూడు దేవాలయాలను నిర్మాంచామని రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ అన్నారు. పేరిపి గ్రామంలో 23 లక్షల వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్, రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.44 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను మంత్రి బొత్స సత్యన్నారాయణ ప్రారంభించారు. ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా మండల కేంద్రంలో ఉన్న కార్యాలయాలకు పరుగుతు తీయకుండా గ్రామంలోనే అన్ని సమస్యలు పరిష్కరించేలా ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందన్నారు. తాము మంచి చేసామంటేనే తమను ఆదరించండని మంత్రి కోరారు. అనంతరం ప్రజలకు పట్టాలు అందజేసారు. కార్యక్రమంలో అధికారులతో పాటు సర్పంచ్ కోరాడ పృద్వి, అగ్రికల్చర్ మండల ఛైర్మన్ కోరాడ నారాయణరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిటిఫ్ విజయనగరం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. ఆదివారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించి అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 25మంది తో జిల్లా కమిటీ ఏర్పాటు కాగా, నలుగురిని రాష్ట్ర కౌన్సిలర్లగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ బుకారిబాబు, పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే విధంగా, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రామాల అభివద్ధి టిడిపితోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు అన్నారు. బాబు ష్యూరిటీ-మ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మలిచర్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం, అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు, రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే తెలుగుదేశం - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామాలలో ఎంతో అభివృద్ధి జరిగిందని, అన్ని గ్రామాలలో సిసి రోడ్లు వేసారని, రైతులకు రుణ మాఫీ చేసి ఆదుకున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని అన్నారు. పార్టీ నాయకులు ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబటిసత్రం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

రోడ్డు పనులకు కోలగట్ల శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నో ఏళ్లగా అస్తవ్యస్తంగా, ఆటంకాల నడుమ మగ్గిన అంబటి సత్రం కొత్తపేట నీళ్ల ట్యాంక్ జంక్షన్ ప్రధాన రహదారికి మోక్షం లభించింది. ఆదివారం ఈ రహదారి నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఆర్అండ్‌బి నిధులు రూ.3.50 కోట్లు, కార్పొరేషన్ నిధులు రూ.93.50 లక్షలతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఈ రహదారి పనులు పూర్తయితే నగరంలో ప్రధాన రహదారుల సమస్య తీరినట్లు అవుతుందని అన్నారు. త్వరలోనే కంటోన్మెంట్ అయ్యన్నపేట రహదారిని కూడా ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరోసారి గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, ఇసరపు రేవతి దేవి, పట్టా ఆదిలక్ష్మి, రాగాన రూపాదేవి, వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వారందరికీ కుళాయి కనెక్షన్లు

కుళాయిల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కనెక్షన్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కె.ఎల్.పురం వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం కుళాయి కనెక్షన్ల కోసం డిప్యూటీ స్పీకర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. కె.ఎల్ పురం, రెవిన్యూ కాలనీలకు చెందిన 70 మంది లబ్ధిదారులు కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తులు సమర్పించారు. లబ్ధిదారులతో కోలగట్ల మాట్లాడుతూ అందరికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని, పైప్ లైన్లు కూడా వేస్తామని, కంగారు పడవద్దని తెలిపారు. కె.ఎల్ పురం వాసులకు రక్షిత తాగు నీటి సమస్య ఉందని గుర్తించి ఇక్కడ వాటర్ ట్యాంక్ ను నిర్మించామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు తీసుకొని కుళాయిలు వేయాలని కార్పొరేటర్, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషి కుమారి, తాళ్లపూడి రమణ, పబ్లిక్ హెల్త్ డిఇ అప్పా రావు, కె ఎల్ పురం, కామాక్షి నగర్, రెవిన్యూ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

కొత్త భూహక్కుచట్టంతో నష్టమే

న్యాయవాదుల స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు బెవర

ప్రజాశక్తి-విజయ నగరం లీగల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన భూ హక్కు చట్టం వలన ప్రయోజనం కన్నా నష్టం, ఇబ్బందులే ఎక్కువని ఉత్తరాంధ్ర న్యాయ వాదుల స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు బెవర సత్య నారాయణ అన్నారు. ఈ చట్టం వల్ల కలిగే ఇబ్బందులపై జిల్లా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు సి హెచ్ దామోదర రామమోహన్ రావు అధ్యక్షతన డెంకాడ మండలంలో మోదవలసలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సత్య నారాయణ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా కొత్త భూ హక్కు చట్టాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం అమల్లో కి తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం వలన వారసత్వం లేదా కొనుగోలు ద్వారా సంక్రమించిన ఆస్తుల వివరాలు ముందుగా టైటలింగ్ అధికారి వద్ద నమోదు చేయాలన్నారు. కోర్టులో వున్న కేసులు, కోర్టుకు వెళ్లే ముందు వాటి వివరాలు సంబంధిత అధికారులతో ధ్రువ పత్రాలు సమర్పించాలని తెలిపారు. లేదంటే ఆ ఆస్తులపై హక్కులు కోల్పోయే అవకాశం ఉందన్నారు. హక్కులను భంగం కలగకుండా ప్రజలకు ప్రయోజనకారిగా ఉండేలా చట్టాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన విశాఖ పట్నం న్యాయ వాదుల సంఘం కార్య దర్శి పైలా శ్రీనివాస రావు మాట్లాడుతూ ఈ చట్టం ఇటు న్యాయ వ్యవస్థల్ని, అటు ప్రజల హక్కులను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. చట్టంపై అవగాహన పెంచుకుని స్థానిక రాజకీయ నాయకులపై వత్తిడి చేసినపుడే మన హక్కులను కాపాడుకోగలమన్నారు. స్థానిక న్యాయ వాదులు ఇనుగంటి సురేష్,ధవళ శివరాం,కే రవిబాబు తదితరులు మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యంగా పోరాడితే రాజ్యాంగం కల్పించే హక్కులను కాపాడుకోగలమని అన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాది సత్యనారాయణ

ఘనంగా వ్యాకులమాత యాత్ర

ప్రజాశక్తి-కొత్తవలస

రోమన్ కేథలిక్‌లు అమితంగా పూజించే కొండడాబా వ్యాకులమాత జాతర ఆదివారం ఘనంగా జరిగింది. కొత్తవలస మండల కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్లు దూరంలో కొండడాబాలు వద్ద వెలసిన వ్యాకులమాత పుణ్యక్షేత్ర యాత్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. శనివారం నుంచి భక్తులు లక్షలాదిగా వచ్చారు. రెండు రోజులు జరిగే ఈ యాత్రకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరలివచ్చారు. కొండడాబాలు విచారణ కర్త గొంగాడ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, జాతర ప్రాంగణంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. శనివారం విశాఖపట్నం జ్ఞానాపురం నుంచి మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి యాత్రికులు కొండకు చేరుకున్నారు. గురువులు జొన్నాడ జాన్ ప్రకాష్, కోన జయరాజు, డాక్టర్ మల్లవరం ప్రకాష్, జొన్నాడ జాన్ ప్రకాష్, చిటికెల రాజ్‌కుమార్ ఆధ్వర్యాన పూజలు నిర్వహించారు. జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ప్రశాంతంగా నిర్వహించడానికి 150 మంది పోలీసు సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ వి. చంద్రశేఖర్ తెలిపారు.

కొండడాబాకు తరలివచ్చిన యాత్రికులు

విభజన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను కేంద్రం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్ డిమాండ్ చేశారు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను విభజించినప్పుడు విభజన హామీలు ఏవైతే ఉన్నాయో వాటిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి వెంకన్న సాక్షిగా ఒప్పుకొని ఇప్పుడు మొండి చేయి చూపిస్తున్నారని అన్నారు హామీలు నెరవేర్చకుండా మోసపూరిత హామీలు ఇస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బిజెపిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ ఛైర్మన్ చింతపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శనమనేటి శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు దుప్పాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతో క్షయ, కుష్టు నివారణ

- రోగులను గుర్తించేందుకు ఎల్‌సిడిసి కార్యాచరణ
- స్వీయ రక్షణ చర్యలతో వ్యాధి నివారణ సాధ్యమే
- ప్రజాశక్తితో క్షయ నివారణ అధికారి కె.రాణి ముఖాముఖి

జిల్లాలో క్షయ, కుష్టు వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వ పరంగా పలు చర్యలు తీసుకుం టున్నట్లు జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి, క్షయ నివారణ అధికారి కె.రాణి తెలిపారు. ప్రణాళిక బద్ధంగా క్రమం తప్పకుండా మందులు వేసుకొని, సరైన పోషకాహారం తీసుకుంటే ఈ వ్యాధులను నివారించ వచ్చునని చెప్పారు. రోగులను గుర్తించేందుకు ఎల్‌సిడిసి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వీయ రక్షణ చర్యలతో వ్యాధి నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రజాశక్తికి ఈవారం ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా క్షయ (టిబి) రోగులు ఎంతమంది ఉన్నారు?

జిల్లా వ్యాప్తంగా 2023 చివరి నాటికి 1537 మంది క్షయ రోగులను గుర్తించాం. విపరీతంగా దగ్గు, కఫం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, లో ఫీవర్ ఉండడం వంటి లక్షణాలతో వీరంతా ఉండడంతో పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేశాం. ఈ లక్షణాలు ఎవరిలో అయితే కనిపిస్తాయో వారు దగ్గరలో గల ఆసుపత్రికి వెళ్లి కఫాన్ని పరీక్ష చేయించుకుంటే వ్యాధిని గుర్తించవచ్చు.

రోగులను గుర్తించిన తరువాత వారికి వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారు?

క్షయ రోగులకు ఎల్‌సిడిసి విధానం ద్వారా గుర్తిస్తున్నాం. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను తమ సిబ్బంది ద్వారా రోగులకు అందిస్తున్నాం. మందులనేవి ఆరు నెలల నుంచి 9 లేదా 12 నెలల వరకు ఇవ్వవచ్చు. వ్యాధి పూర్తిగా నియంత్రణలోకి వచ్చిన తరువాత మరొకసారి టెస్ట్ చేయించి మందులను నిలిపివేస్తాం.

టిబి రోగులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయసహకారాలు అందిస్తున్నారు?

క్షయ రోగులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. రోగులకు ఫుడ్ బాస్కెట్, నిక్షయ పోషణ యోచనలో భాగంగా నెలకు రూ.500 చొప్పున 6నెలలకు రూ.3వేలు అందిస్తున్నాం.

రోగులు ఎంత కాలం పాటు మందులు వాడాలి?

రోగి మందులు వాడుతూ ఉండగా రోగ నిర్ధారణ శక్తిని బట్టి కొందరిలో 6,9,12నెలల సమయం పడుతుంది. ఈ జబ్బు రెండు రూపాల్లో ఉంటుంది. పల్మనరీ, ఎక్స్ ట్రా పల్మనరీ రూపాల్లో ఉంటుంది. పల్మనరీ అంటు గొంతుకు సంబంధించినది. ఎక్స్‌ట్రా పల్మనరీ అంటే ఎముకలకు, మెదడకు వ్యాప్తి చెందుతుంది. పలు రకాల పరీక్షలను బట్టి వ్యాధి నిర్ధారణ చేస్తారు.

రోగితో పాటు ఇంట్లో ఉంటున్న కుటుంబ సభ్యులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి

తుమ్ము, దగ్గు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి కాబట్టి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. రోగులకు దూరంగా ఉండాలి. 6ఏళ్ల లోపల, తర్వాత వయసు బట్టి మందులు అందిస్తాం.

రోగులు ఎటువంటి ఆహారాలు తీసుకోవాలి ?

పాలు, గుడ్లు, పప్పు దినుసులు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. షుగర్ వ్యాధి ఉన్న వారు మాత్రం కార్బోహైడ్రేట్స్ ఉన్న వాటిని వాడడం వలన షుగర్ తగు మోతాదులో ఉంటుంది. అందువల్ల జాగ్రత్త లు తీసుకోవాలి.

క్షయపై అవగాహన కార్యక్రమాలు ఏమైనా చేపడుతున్నారా?

గ్రామ, పంచాయతీ, మండల,పట్టణ, జిల్లా స్థాయిలో మా సిబ్బంది, స్థానిక హెల్త్ సెంటర్లు, సోషల్ వర్కర్స్ సహాయ సహకారాలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. వ్యాధి నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నాం.

కుష్టువ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

కుష్టు వ్యాధి అంతం పేరుతో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కుష్టు వ్యాధితో పోరాడుదాం - కుష్టువ్యాధినిగత చరిత్ర గా మారుద్దాం అంటూ ప్రచారం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా మొన్నటి వరకు 230మంది రోగులు ఉండగా, ఐసిడిసి ఈ మధ్య నిర్వహించిన కార్యక్రమం ద్వారా మరో 63మందిని గుర్తించాం.

కుష్టు వ్యాధిని ఎలా గుర్తించాలి? వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

వ్యక్తుల శరీరం పై రాగి రంగు మచ్చలు, తిమురులు అధికంగా రావడం ద్వారా గుర్తించవచ్చు. దగ్గు, తుమ్ము తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. 2027నాటికి లెప్రసీ రహిత దేశంగా చేయాలనేదే ప్రధాన ఉద్దేశం. కుష్టు వ్యాధి ఎక్కువైతే అంగవైకల్యం సంభవించే అవకాశం ఉంటుంది. అటువంటి పరిస్థితి రాకుండా లక్షణాలు ఉన్న వ్యక్తులు ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. రోగులకు మందులు ఫ్రీగా ఇస్తాం.

షరా 'మామూళ్లే'

- అక్రమంగా తరలిపోతున్న కలప
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు
- లంచాల మత్తులో కినుక..

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి, రామభద్రపురం మండలాలు నుంచి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. అటవీశాఖ అనుమతులు తీసుకుని చెట్లు కొట్టి తరలించాల్సి ఉన్నప్పటికీ కలప వ్యాపారులు ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా చెట్లు కొట్టి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ కలప రవాణాను అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని విమర్శలు వస్తున్నాయి.

బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది లోడ్లు కలపను కొంత మంది గజపతినగరం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గతనెల 29న రామభద్రపురం మండలం గొల్లలపేట నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండా రెండు ట్రాక్టర్లతో టేకు, పాచి కలపను తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో అటవీశాఖ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి వారం రోజులు గడవక ముందే బొబ్బిలి ప్రాంతం నుంచి కలపను మళ్లీ పట్టపగలు తరలిస్తున్నారంటే అక్రమ కలప తరలింపునకు అటవీశాఖ అధికారులు సహకారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చును.

తరలిపోతున్న కలప

పట్టపగలే కలప తరలింపు

కలప వ్యాపారులు అటవీశాఖ అధికారులతో ఒప్పందం కుదుర్చుకుని అనుమతులు తీసుకోకుండా బొబ్బిలి, రామభద్రపురం ప్రాంతాల నుంచి పట్టపగలే చెట్లను కొట్టి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు చెట్లను కొనుగోలు చేసి అటవీశాఖ అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో ఉన్న చెట్లను అక్రమంగా కొట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డొంగురువలస గిరిజన ప్రాంతం నుంచి ట్రాక్టర్‌తో అక్రమంగా కలప తరలించడం ప్రజాశక్తి కంట పడింది. గిరిజన ప్రాంతం నుంచి శనివారం సాయంత్రం 5గంటల సమయంలో ఒక ట్రాక్టర్‌తో కలపను అక్రమంగా తరలిస్తున్నారంటే కలప అక్రమ రవాణా ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చునని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఫిర్యాదులు వస్తేనే కేసులు

అక్రమ కలప తరలింపుపై ఫిర్యాదులు వస్తేనే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదులు రాకపోతే అక్రమ కలప తరలింపుపై ఎటువంటి చర్యలు తీసుకునే దాఖలాలు లేవు. అటవీ ప్రాంతాల్లో కూడా చెట్లులను అక్రమంగా కొడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటాలని ప్రభుత్వం ఏటా ప్రత్యేక కార్యక్రమం చేపడుతోంది. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని కాపాడాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వ అధికారులు పని చేయడం లేదు. పర్యావరణ పరిరక్షణకు అక్రమ కలప రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణబాబును సత్కరిస్తున్న మహేష్

యువకుడికి సత్కారం

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడకు చెందిన మాదాబత్తుల కృష్ణబాబు స్థానిక శాఖా గ్రంథాలయంలోనే చదుకుని ఇటీవల ఎస్ఐ పోస్టుకు ఎంపికవడం పట్ల ఆదివారం గ్రంథాలయంలో లైబ్రేరియన్ మహేష్ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ లైబ్రరీలో చదువుకొని ఉద్యోగం సాధించిన కృష్ణబాబును ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు, పాఠకులు కూడా మంచి మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుకుని ఉద్యోగం సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సన్మాన గ్రహీత కృష్ణబాబు మాట్లాడుతూ లైబ్రరీలో పుస్తకాలు చదవడం వల్ల పరీక్షలను సులువుగా రాయగలిగానన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక అభ్యుదయ పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ చింతా శారద తెలిపారు. అభ్యుదయ ఫౌండేషన్, అభ్యుదయ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. మహిళలకు కేన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వెలమలకు సీట్లు కేటాయించాలి'

ప్రజాశక్తి- మెంటాడ

రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం 5 పార్లమెంట్, 25 అసెంబ్లీ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. మెంటాడలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో 50 లక్షలు పైబడి ఉన్న వెలమ సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మొన్న వైసిపి పార్టీ విజయనగరం, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాలు కాపు సామాజిక వర్గం కేటాయింపు పై పునరాలోచన చేయాలని కోరారు. ఒకే సామాజిక వర్గానికి రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించడం సబబు కాదన్నారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, నాయకులు బర్ల పైడంనాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, పి మల్లయ్య దొర, బోదంకి రమణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమికాపల్లిలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణిబాబు, అయ్యప్ప ఎంటర్ప్రైజెస్ వల్లెపు కైలాష్, విజయ మెడికల్ అకౌంటెంట్ వేణుగోపాలరావు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, కొత్తవలస 1వ వార్డు మెంబర్ కర్రి సూర్యనూకరాజు చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్, గోవిందరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లండ మృతికి శివరామకృష్ణ నివాళి

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని అంబటివలస పంచాయతి రోళ్లవాక గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు లండ అచ్చెం నాయుడు అనారోగ్యంతో శనివారం మృతి చెందిన విషయం తెలుసుకుని ఆదివారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణంశివ రామకృష్ణ ఆయన కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. అచ్చెంనాయుడు మరణం టిడిపి పార్టికి తీరని లోటని అన్నారు. ఈయన వెంట టిడిపి సీనియర్ నాయకులు పాలూరి మురళి, తాళ్ళపూడి అప్పలనాయుడు, అప్పలరాజు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతి గృహంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోనూ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వసతి గృహం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు 5వ తరగతిలో ప్రవేశాల కోసం మార్చి 10వ తేదీన పరీక్షలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు https://apbragcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో గల పాల కేంద్రం వద్ద సోమవారం విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విక్టరీ ఇంగ్లీష్ మీడియం స్కూలు యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి వచ్చే వారు కచ్చితంగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు బుక్కు, ఫోన్ నెంబరు, రెండు జతల బట్టలు, కంచం, గ్లాసు, తీసుకుని రావాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

వైసిపి నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- తెర్లాం

మధును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మండలంలోని బూరిపేట సర్పంచ్ భర్త, వైసిపి నాయకుడు బూరి మధుసూదన రావును విజయనగరం తిరుమల ఆస్పంత్రిలో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు పరామర్శించారు. శనివారం ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నేరుగా ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సుందరాడ సర్పంచ్ దిలీప్ కుమార్, సతివాడ సర్పంచ్ జానికి రామ్, గొలుగు వలస సర్పంచ్ శంకర్రావు తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ హత్య దారుణం

ప్రజాశక్తి - తెర్లాం

తహశీల్దార్ రమణయ్య హత్య దారుణమని విఆర్ఒల సంఘం అధ్యఒఉలు ఎన్. నరసింహనాయుడు ఖండించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ హత్యకు కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్ఒలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయ ఎస్‌సి కాలనీలో సీసీ రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, మట్టిని కూలీలు తొలగించారు. పారిశుధ్య పనులను సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

రైల్వే కూలీలతో సిరిసహస్ర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఈస్ట్ కోస్ట్ రైల్వే స్టేషన్ ఆవరణలో పని చేస్తున్న రైల్వేకూలీల కష్ట సుఖాలను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర తెలుసుకున్నారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో కలిసి వారితో పాటు టిఫిన్లు చేశారు. వారి సమస్యలు విని వైసిపి రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్ చిన్న శ్రీను దృష్టికి తీసుకు వెళ్తానానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తోట వాసు, జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం ఆపించండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి గ్రామంలో కోళ్లపారం యజమాని అక్రమంగా గెడ్డవాగులో నిర్మిస్తున్న ప్రహరీని రైతులు చుక్క లక్ష్మణ, గుజ్జు రాధమ్మ ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 79/5లో గెడ్డను ఆనుకొని తమ భూములున్నాయన్నారు. తమ డాక్‌మెంట్‌లో కూడా అది గెడ్డవాగుగానే రాసి ఉందన్నారు. ఆ గెడ్డవాగులు నుండి కొండల్లో నీరు రామతీర్థసాగర్ రిజర్వాయర్‌లోకి వెలుతుందన్నారు. ఇప్పుడు ఆ గెడ్డను అక్కడ కోళ్లపారం యజమాని కబ్జా చేసి ప్రహరీ నిర్మాణం చేస్తున్నాడని దీంతో గెడ్డలో నీరు తమ పొలాల్లోకి వచ్చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలు క్రితం కూడా ఇలా నిర్మాణానికి పూనుకుంటే రైతులంతా అడ్డుకున్నామని గుర్తు చేశారు. అప్పుడు వదిలేసి మరలా ఇప్పుడు అక్రమ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. రెవెన్యూ అధికార్లు స్పందించి అక్రమ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్ష

విజయనగరంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. నగరంలోని కస్పా హైస్కూలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ హాజరై ప్రశ్నా పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంగా విద్యార్థులతో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడుతుందని అన్నారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవిద్యార్థులకు ఇటువంటి పరీక్షలు నిర్వహించి వారిలో భయాందోళనలు పోగొట్టేందుకు, వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఈ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారికి జిల్లా మొదటి స్థానానికి రూ. 5వేలు, రెండో స్థానానికి రూ.2వేలు, మూడోస్థానం రూ.2వేలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, ఎం.సౌమ్య, ఎం.వెంకటేష్ జిల్లా సహాయ కార్యదర్శులు పి.రమేష్, ఎస్ సమీరా, జిల్లా కమిటీ సభ్యులు కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పట్ల భయం వీడాలి

బొబ్బిలి : పరీక్షలు పట్ల విద్యార్థులు భయం వీడాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో శ్రీసాయి డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాలను యుటిఎఫ్, ఎస్.ఎఫ్.ఐ నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ పరీక్షలు పట్ల భయం వీడితేనే పబ్లిక్ పరీక్షలు బాగా రాయగలరని విద్యార్థులకు సూచించారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎస్.ఎఫ్.ఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికుమార్, ఇన్విజిలేటర్లుగా యుటఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవ్, రామకష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు డేవిడ్, కిరణ్, లోకేశ్వరి, వసంత, పాల్గొన్నారు.

కొత్తవలస : స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ మహేష్, ప్రిన్సిపాల్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు నాయుడు, గణేష్ పరీక్షా పత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చైతన్య, నాయుడు, తేజ తదితరులు పాల్గొన్నారు.

జామి : మండలంలోని పలు పాఠశాలలలో 10 వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.హర్ష మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రవి, జైతు పాల్గొన్నారు.

బాడంగి : విద్యార్థులు భయం పోగొట్టడమే ప్రజ్ఞా వికాస పరీక్ష లక్ష్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు జెడ్‌పి హైస్కూలులో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించారు. 200 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరశన కొనసాగిస్తామని, మూడు లాంతర్లవరకు ర్యాలీ చేసి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం అందజేస్తామని మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ స్పష్టం చేశారు. మిమ్స్ యాజమాన్యం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారం నాటికి నాల్గో రోజుకు చేరింది. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరితే మిమ్స్ యాజమాన్యం సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోని బకాయి ఉన్న 7 డిఎలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారించే వరకు నిరవధిక ధర్నా కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు ఎం.నారాయణ రావు, వి అప్పల నాయుడు, కె.

నిరసన శిబిరంలో మాట్లాడుతున్న టివి రమణ

కాము నాయుడు, టి. రామకృష్ణ, ఎం.నాగ భూషణం, కె.నాగేశ్వరరావు, జి. వరలక్ష్మీ, వి.భవాని, బి.బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అబద్దాలు ఆపి..ప్రజలకు వాస్తవాలు చెప్పండి

మిమ్స్ యాజమాన్యం పచ్చి అబద్దాలతో కూడిన ప్రకటన ఒకటి జారీ చేసిందని దాన్ని ఖండిస్తున్నామని మిమ్స్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఆదివారం స్థానిక నిరశన శిబిరం వద్ద వారు మాట్లాడుతూ వాస్తవానికి 2020 మార్చి 22న లాక్ డౌన్ నాటికి వేతన ఒప్పందానికి ఉద్యోగులంతా నిరవధిక సమ్మెలో ఉన్నారని, కోవిడ్ మహమ్మారి వల్ల ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు వైద్య రంగంలో పనిచేస్తున్న తాము సమ్మె చేయటం సరైనది కాదని యూనియన్ నాయకులు టివి రమణ ఉద్యోగులందరికీ నచ్చజెప్పి సమ్మెను తాత్కాలికంగా విరమింపచేసి కోవిడ్ విధులకు హజరయ్యామన్నారు. 2011 అక్టోబర్ నుంచి 2020 ఏప్రిల్ వరకు క్రమం తప్పకుండా డిఎలను యాజమాన్యం చెల్లించిందని, 2011, 2013, 2015, 2017 సంవత్సరాల్లో జీతభత్యాలకు సంబంధించిన వేతన ఒప్పందాలు జరిగాయన్నారు. 2019 ఆగస్టులో వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా నేటికి జరగలేదన్నారు. 2020 అక్టోబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు మొత్తంగా 7 డిఎలను ఉద్యోగులకు ఇవ్వకుండా మిమ్స్ యాజమాన్యం ఎగ్గొట్టడం నిజం కాదా అని ప్రశ్నించారు. వేతన ఒప్పందం, డిఎలు గురించి అడిగితే బదిలీలు, సస్పెండ్‌లు చేసి ఉద్యోగులను భయభ్రాంతులకు గరిచేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

విజయగౌరి హౌస్ అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని విశాఖలో నిర్వహించిన సాగర సంగ్రామ ర్యాలీకు వెళ్లకుండా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరిను పోలీసులు ఆదివారం తెల్లవారు జామున హౌస్ అరెస్టు చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరితే పోలీసులతో అరెస్టులు చేపించడం దుర్మార్గమని ప్రభుత్వ వైఖరిపై విజయగౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

పోలీసుల అదుపులో ఉన్న విజయగౌరి

పలు గ్రామాల్లో టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి, ఎఎస్‌పేట, జగ్గయ్యపేట, అరిగిపాలెం, కొత్త సింగరాయి, ఆతవ గ్రామాల్లో ఆదివారం టిడిపి బైక్ ర్యాలీ ఐదో రోజు కొనసాగింది. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపడుతున్నారు. ఇందులో భాగంగా సింగరాయి గ్రామంలో సామాజిక కార్యకర్త ఆర్ అప్పారావు ఏర్పాటు చేసిన వృద్ధులకు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొంప కృష్ణ టిడిపి మినీ మెనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఒక వేళ పరిష్కారం కాకపోతే చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పరిష్కరిస్తామని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ చంద్రబాబును గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల ముందు మెగా డిఎస్‌సి పేరిట జగన్ దగా డిఎస్‌సిని ప్రకటించారని ప్రజలు దీన్ని నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నియోజకవర్గం మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, రాయవరపు చంద్రశేఖర్, గోరుపోటు వెంకటరమణ, గొర్లి నాగరాజు, సిరికి రమణ, మంచిన అప్పలసూరి, పల్లి ధనుంజయ, కెపి నాయుడు, కొట్టాన అర్జునరావు, ముక్క రామకృష్ణ, సేనాపతి గణేష్, తాడి కృష్ణ జగన్, వై.సూర్యం, సిరికి నాయుడు, రమేష్, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు గొంప, తదితరులు

గుంతల్ని చూశారు... కప్పేశారు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎవరో వస్తారని ఏదో చేస్తారని.. అనుకోకుండా..వారు నిత్యం ప్రమాదకరమైన గోతులను పూడ్చే సేవా కార్యక్రమం మొదలు పెట్టారు. పాత బొబ్బిలి నుండి బొబ్బిలి జ్యూట్ మిల్ రోడ్డు వరకు రోడ్లపై వున్న పెద్ద గుంతల్ని ఆదివారం ఉదయం గాంధీ స్మారక నిధి సభ్యులు పూడ్చారు. బొబ్బిలి - పార్వతీ పురం హైవే మీద నిరంతర రద్దీ వల్ల రోడ్డుపై పలు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి వల్ల వాహన చోదకులు, పాద చారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యం గా సాయి శార్వాణి, పెట్రోల్ బంకు, స్వగృహ స్వీట్స్, ముందున్న పెద్ద గోతుల వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నిటినీ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు ఎం. విజయ మోహన్‌రావు ఆధ్వర్యంలో సభ్యులు ఇసరాపు బాబూరావు, వెలగడ రాంబాబు, సైలాడ జాషువా, ఎం.రామకృష్ణ తదితరులు స్వచ్ఛం దంగా ఆదివారం ఉదయం సిమెంటు రాళ్లు, కంకర మట్టి, ఇసుక సేకరించి గోతుల్ని పూడ్చారు. ఈ సంద ర్భంగా అధ్యక్షుడు విజయ మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 7 వరకు తమ గాంధీ స్మారక నిధి సభ్యులు శ్రమదానం చేస్తూ రోడ్లపై ఉన్న గుంతల్ని పూడ్చే కార్యక్రమం చేపడుతున్నామ న్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్రాంతంలోని రోడ్ల మీద వున్న గొయ్యిలను పూడిస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. శ్రమ దానం చేసి గొయ్యిలను కప్పిన గాంధీ స్మారక నిధి సభ్యులకు వాహన చోదకులు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలను పూడ్చుతున్న సభ్యులు

మేలు జరిగిందంటేనే ఓటు వేయండి : బొత్స

బొండపల్లి : సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి- మెరకముడిదాం

'మీకు మేలు జరిగిందంటేనే ఓటు వెయ్యండి, మోసం జరిగితే వేయవద్దు' అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం గర్భాంలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన మాట్లాడారు. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక్క మెరక ముడిదాం మండలంలోనే రూ.10 కోట్లు నాల్గవ విడత ఆసరా నిధులు మహిళల ఖాతాల్లో వేశామన్నారు. వైసిపి పాలనలో ఈ మండలాన్ని రూ.105కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొనే వాన్ని తప్ప మోసం చేయటం తనకు తెలియదని అన్నారు. తన వల్ల ఈ మండలం అభివృద్ధి చెందిందంటేనే, మీకు మంచి చేసాను అనుకొంటేనే, రాబోయే ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపంచాలని కోరారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మండలం మంత్రికి అడ్డా అన్నారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెసి కార్తిక్, ఎంపిడిఒ పావని, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, వైసిపి నాయకులు తాడ్డి వేణు, ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకటరావు, పప్పల కృష్ణమూర్తి, కెవిస్ ఆర్యే ప్రసాద్, బూర్లె నరేష్ కుమార్, వైస్ ఎంపిపి తలచుట్ల హరి బాబు, కందుల పార్వతి, కెవి సూర్య నారాయణరాజు తహశీల్దార్ పద్మావతి, ఎపిఎం కె. ఉమామహేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: ప్రభుత్వ పథకాలు పొందిన లబ్దిదారుల ఆశీస్సులే ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని పోలీసు స్టేషన్ సమీపంలోని ఓ లేఅవుట్‌లో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన వైఎస్ఆర్ నాలుగువ విడత ఆసరా సంబరాల బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనరసయ్య మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక పరిపుష్టిని తీసుకు రావడానికి డ్వాక్రా రుణ మాఫీని చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిదేనన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్మోహన రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సులోచనాదేవి, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, వెలుగు ఎపిడి కె. సావిత్రి, ఎంపిడిఒ ఎస్. హరిహరరావు, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, నాయకులు రొంగలి పోతన్న, పోరిపిరెడ్డి అప్పలనాయుడు, బి.రవికుమార్, బివి ప్రభుజీ, మహంతి రమణ, గొల్లు సతీష్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు , వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: పేద ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారు గర్వంగా తలెత్తుకొనేలా చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో వైఎస్ఆర్ కాంతిపథం ఏరియా కోఆర్డినేటర్ ఎన్.ఆదయ్య ఆధ్వర్యంలో ఆదివారం 4వ విడత ఆసరా సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 1295 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని సుమారు 15,266 మంది మహిళలకు లబ్ధి చేకూరేలా రూ.8.81 కోట్ల వారి ఖాతాల్లోనే వేస్తున్నామన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామనాయుడు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, పిఏసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి, కొత్తవలస మేజరు పంచాయతీ సర్పంచ్ ఎంవై రామస్వామి, జెసిఎస్ మండల ఇంచార్జ్ బొంతల వెంకటరావు, సర్పంచులు జోడు రాములమ్మ, విరోతి కొండల రావు, పీతల కృష్ణ, అల్లం సత్యన్నారాయణ, విరోతి వెంకట రమణ, ఎంపిటిసిలు, పాల్గొన్నారు

In the Hon'ble Court of the 1st. Addl. Jr. Civil Judge at Vizianagaram
E.P.63/23 OS 210/22

Between:
Sirigudi Gopi ....D.Hr.
And:
Matta Samba Murthy ......J.Dr.

U/o. 21 R.54, 64-66 of C.P.C. Notice

యిందు మూలంగా తెలియజేయునది ఏమనగా, విజయనగరం 1st. ADDL.JR.Civil Judge కోర్టులో కేసు నెం. E.P.63/23 in O.S.210/22 యందు J.Dr యైన Matta Samba Murthy గారి స్థిరాస్థియైన H.No.1-159 పైన Attachment కొరకు పెట్టియున్నారు. J.Dr.కు తగు నోటీసులు చాలామార్లు పంపినా కూడా కోర్టుకు హాజరు కావడం లేదు. పైన తెల్పిన కోర్టుకు **29-2-2024** తేదీన ప్రత్యక్షంగా హాజరు కావలెను. లేనియెడల కోర్టువారు తగు నిర్ణయం తీసుకొనెదురు.

SCHEDULE

Vizianagaram Dist. Gurla Mandalam, Under Chodavaram Panchayat Area, House No. 1-159 కు హద్దులు :-
East : Sunkari Satti Babu House, South : Vacant Site, West : Vangamudi Bullamma House, North : C.C. Road.

Vizianagaram
Dt.4-2-2024

CH.SURIBABU
Advocate, Garividi,
Cell: 8500626909

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL AND DISTRICT JUDGE VIZIANAGARAM
G.O. P. 34 /2023

1.Sri Karri Umamahesara Rao, S/o Nageswara Rao R/o Door No. 8-23-21, Balaji Nagar, Thotapalam, Vizianagaram town.
2. Karri Om Shivini, (M) D/o Umamahesara Rao R/o Door No 8-23-21, Balaji Nagar. Thotapalam. Vizianagaram town.--PETITIONERS
VS
II. The Respondent is : Nil

పై నెంబరు దావాలో 1వ పిటిషనర్ 2వ పిటిషనర్ (మైనర్) తండ్రి. 2వ పిటిషనర్‌కు ఈ క్రింది షెడ్యుల్ ఆస్థి వారి తాత గారైన కర్రి నాగేశ్వరరావు గారి నుండి తే 30-9-2015 ది గిఫ్ట్ డీడి నెంబరు 6110/2015 విజయనగరం వెస్ట్ సబ్ రిజిస్ట్రరు ద్వారా దాఖలు పడినది. 2వ పపిటీషను (మైనరు) బాగోగులు మరియు చదువు కోరకు ఆ ఆస్థిని అమ్ముటకొరకు సెక్షన్ 8(2) మైనరిటీ గార్డియన్ చట్టం ప్రకారం 1వ పిటిషనర్ (గార్డియన్) అనుమతి కొరకు పై కోర్టులో పై దావా వేసియున్నారు. ఈ విషయై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల **తే29-02-2024దిన ఉ॥10:30 గం॥లకు** పై కోర్టులో వారి అభ్యంతరములు స్వంతముగా గాని, వకీలు ద్వారా గాని తెలియపరచవలెను. ఎంటువంటి అభ్యంతరములు రాని ఎడల వారి అభ్యర్ధనను అనుమతించెను.

SCHEDULE OF THE PROPERTY

All that part and parcel of the land measuring an extent of 37.58 Sq.yds undivided, unspecific share out of the total extent of 2825.66 Sq.yds together with an extent of 1000 Sft including common areas, and 100 Sft car parking, Flat no 113 in Ground floor, in ANANDA PLAZA, constructed in the lane of Door No 8-30-1, covered by S. No 84/1, 83 and 83/5 part Vizianagaram 1st bit, Vizianagaram Municipality, Vizianagaram Sub Register office,Vizianagaram District.
Flat Boundaries: East: Open to Sky & Lift **South:** Flat No 109 **West:** Corridor **North:** Open to Sky

C S BHAGAVAN
ADVOCATE, VIJIANAGARAM.